మన కాలేయం కొలెస్ట్రాల్‌ను ఉత్పత్తి చేస్తుంది. రక్తం ఆ కొలెస్ట్రాల్‌ను లిపోప్రోటీన్‌లు అని పిలువబడే అణువుల్లో కణాల దగ్గరికి తీసుకువెళుతుంది.

ఈ లిపోప్రోటీన్‌లలో కొలెస్ట్రాల్, క్రొవ్వులు, ప్రోటీన్‌లు వుంటాయి. రక్తం కొలెస్ట్రాలలో అధికభాగాన్ని తీసుకెళ్ళే రెండు రకాల లిపోప్రోటీన్‌లు (ఎల్.డి.ఎల్. లో డెన్సిటీ లిపోప్రొటీన్, హెచ్.డి.ఎల్. హై డెన్సిటీ లిపోప్రోటీనలు) వుంటాయి. ఎల్.డి.ఎల్.లో కొలెస్ట్రాల్ సమృద్ధిగా వుంటుంది.

అవి రక్తంలో ప్రవహిస్తూ కణకుడ్యం పైనున్న ఎల్.డి.ఎల్ గ్రాహకాల ద్వారా కణాల్లోకి ప్రవేశిస్తాయి. కణాలు తమ ఉపయోగార్థం వీటిని విచ్ఛిన్నం చేస్తాయి. దాంతోపాటు తమకి కావలసినంత ఎల్.డి.ఎల్. ను తీసేసుకుంటాయి.

రక్తప్రవాహంలోని 70 శాతం ఎల్.డి.ఎల్. ని కాలేయంలోని ఎల్.డి.ఎల్. గ్రాహకాలు తీసివేసేలా కాలేయం నిర్మాణం జరిగింది.

మరోవైపు హెడ్‌డి.ఎల్. కొలెస్ట్రాల్ రక్తంలో వుండేటటువంటి అదనపు కొలెస్ట్రాల్‌ను పీల్చివేసి వాటిని కాలేయానికి రవాణా చేస్తాయి.

కాలేయం శరీరానికి కావలసినంత మేరకి మాత్రమే కొలెస్ట్రాల్‌ను అట్టేపెట్టి మిగిలిన కొలెస్ట్రాల్‌ను శరీరంనుండి తీసివేస్తుంది.

రక్తంలో ఎల్.డి.ఎల్. అధికంగా వున్నప్పుడు అసలు సమస్య వస్తుంది. ఇది ధమనుల గోడలపై ప్లాక్ అభివృద్ధి చెందే సాధ్యతను పెంచుతుంది.

ప్లాక్ పేరుకుపోతున్నప్పుడు ధమనులు సంకుచితంగా అయిపోయి వీటిద్వారా ఆక్సిజన్‌ను తీసుకెళ్ళే రక్తం పరిమాణం తగ్గిపోతుంది. ఈ స్థితినే 'అథిరోస్ క్లీరోసిస్' అని పిలవబడుతుంది.

అలా ధమనుల గోడలు పూర్తిగా మూసుకుపోయినప్పుడు గుండెకి రక్తం అందదు. దాంతో గుండె పని చెయ్యటం మానేస్తుంది.

ఇంకొక ప్రమాదం ఏమిటంటే ఒక ధమనిలో పాక్షికంగా అడ్డు ఏర్పడినా అది గుండెధాతువు (ఆ ధమని ద్వారా రక్తాన్ని పొందే గుండె భాగం) చనిపోవడానికి కారణం కావచ్చు.

కానీ ఆ లక్షణం శారీరకంగా మనకి తెలియదు వెంటనే ..... కొన్నాళ్ళు పడుతుంది.

అది సంవత్సరం కావచ్చు, రెండు సంవత్సరాలు కావచ్చు. ఇలా గుండె ధాతువు చనిపోతే కాళ్ళల్లో గ్యాంగ్రీన్ - వ్యాపించడం, మూర్ఛరావడం, చివరికి మూత్రపిండాలు కూడా పనిచేయకుండా పోవచ్చు. ఆ లెక్కన మహదేవ్ ఇప్పుడున్నది లెవెంత్ అవర్‌లో ..... చివరి ప్రయత్నం చేస్తాను .....

"నేనైనా ఓడిపోవాలి, మహదేవ్‌లోని రోగమైన ఓడిపోవాలి" లేచి నిలబడుతూ తీవ్రమయిన పట్టుదలతో అనుకున్నాడతను.

*     *     *     *     *

ఎర్రగా నాలుకలు చాస్తూ మంటలు నృత్యం చేస్తున్నట్టుగా వున్నాయి.

అయినా ఆ మంటలు అతని కళ్ళల్లోని ఎరుపుతో పోటీపడలేక పోతున్నాయి.

నుదుటికిపట్టిన స్వేదాన్ని తుడుచుకుని హోమం ముందు కూర్చున్నాడతను.

ముందు దక్షిణంవైపు చూశాడు ..... అభివాదం చేస్తున్నట్టు తల మూడుసార్లు వంచాడు.

మరుక్షణం ప్రారంభమైంది - హో ..... హో ..... హోమనే హోరు.

రురుడు, కాలుడు, భైరవుడు, భేతాళుడు ముక్తకంఠంతో అరిచినట్టు ఆ పరిసరాలు దద్దరిల్లిపోతున్నాయి ఆ హోరుతో.

చెట్లమీద పక్షులు భయంగా రెక్కలు టపటపకొట్టుకుని మరింతగా ముణగరించుకుని జరుగుతున్న వైనాన్ని చూస్తున్నాయి.

గుడ్లగూబ కళ్ళు చికిలించుకుని చూస్తోంది.

తీతువు భయంకరంగా అరుస్తూ పహరా కాస్తున్నట్లు ఆ ప్రదేశంలో ఎగురుతోంది.

అతడు దిక్కులదిరిపోయేలా పెద్దగా మంత్రం పఠించసాగాడు-

“ఓం ఐం కం రుద్ర భయంకరి అట్టాట్టహాసిని సాధక (మహారూపా రత్నేకరి కృంతని సర్వదు:ఖ ప్రళయని) ఊఀ ..... ఊఀ ..... ఈఀ ..... హుఀ ..... శీఘ్రం సిద్ధిం.

శత్రుప్రాణం భస్మాహుఀ ..... ప్రకృతే ఐక్యం”

కాలం వేగంగా ముందుకు జరుగుతోంది.

చీకటి చిక్కగా వుండి ధారలు ధారలుగా లోకాన్ని ఆక్రమించుకుంటోంది.

*     *     *     *     *

ఎలక్ట్రో కార్డియో గ్రామ్‌వైపు చూశాడు డాక్టర్. శక్తిలేని జీవంలా చిన్నగా కదులుతూ మహదేవ్ హృదయ చలనాన్ని చూపిస్తోంది గ్రాఫ్.

టెంపరేచర్ క్రమక్రమంగా డౌనవుతూ అతని శరీరం చల్లబడసాగింది.

స్టెతస్కోప్‌తో మహదేవ్ హార్ట్‌బీట్ అతి జాగ్రత్తగా వింటున్నాడు డాక్టర్.

లబ్ ..... డబ్ ..... లబ్ ..... డబ్ ..... లబ్ .....

“కమాన్ ఐసే కమాన్ ..... ” కోపంగా అనుకున్నాడు డాక్టర్. అతని ఆజ్ఞని తిరస్కరిస్తున్నట్లు మహదేవ్ హృదయచలనం ఆ ..... గి ..... పో ..... యిం ..... ది .....

*     *     *     *     *

ఆకాశంవైపు తలెత్తి చూశాడతను.

నల్లని గాఢాంధకారంతో ఏమీ కనిపించటంలేదు.

హోమంలో ఎర్రగా కాలుతున్న నిప్పులు ..... మనిషి రక్తాన్ని గుర్తుకు తెస్తూన్నట్లున్నాయ్.

ఎక్కడో పన్నెండు గంటలు మోగుతూ అతని చెవులకు చేరాయ్.

వెంటనే చేతిలోని బొమ్మ వైపు చూశాడతను. దాదాపు శిథిలమై పోయి వుంటుంది.

గాలిలో స్స్ ..... స్స్ ..... స్స్ మనే హోరు మొదలయింది. నీడల్లాంటి ఆకారం లేని జీవులేవో దేనికోసమో ఆత్రపడుతూ సందడి మొదలు పెట్టాయి.

ఒక్కసారిగా ఆకాశం వురిమింది.

ఇక ఆ బీభత్సం చూడలేనట్టు పక్షులన్నీ గూళ్ళు విడిచి ఈశాన్యం వైపు సాగిపోయాయి.

గుడ్లగూబ మాత్రం ఆసక్తిగా చూస్తూనే వుంది. తీతువు పహరా ఆపి చిటారుకొమ్మ పై చేరి హాయిగా విశ్రాంతి తీసుకుంటోంది.

చేతిలోని బొమ్మ ఎడమ కాలుని కసిగా విరిచి విసురుగా నిప్పుల్లో పడేశాడతను.

మరింత భయంకరమైనటువంటి శబ్దంతో ఆకాశం వురిమింది.

దక్షిణం వైపునుంచి వస్తున్న హోరు అతనికి హుషారునిస్తున్నట్లు మరింతగా పెరిగింది.

తరువాత కుడికాలు నిప్పుల్లోపడి మండిపోయింది.

సరిగ్గా అదే సమయంలో ఎవరో నడిచి వస్తున్నట్లు ఎండుటాకులు నలిగిపోతూ చేసిన ఆర్తనాదం అతనికి స్పష్టంగా వినిపించింది.

దాంతోపాటు దక్షిణాన హోరు కూడా క్రమక్రమంగా సద్దుమణగటం గమనించాడతను.

బొమ్మ ఎడమ చేతిని పెకిలించబోయి ఆగిపోయాడతను.

చెవులు రిక్కించి వినసాగాడు.

ఒకటి ..... రెండు ..... మూడు ..... భారంగా గడిచాయి క్షణాలు.

ఎటువంటి శబ్దం తిరిగి వినిపించలేదు.

గాలిలో ఆకారం లేని నీడలు స్వైరవిహారం చేస్తూ కీచుమనే ధ్వని పుట్టిస్తున్నాయ్.

హోమగుండం మరింత ప్రకాశవంతంగా జ్వలిస్తూ ఎదురుచూస్తోంది ..... బొమ్మ ఎడమ చేతిని పెకిలించి అందులో పడేశాడతను .....

ఆ చేతిని ఆత్రంగా అందుకుని భగభగమని మండించాయ్ మంటలు.

మళ్ళీ ఆకులు ఏవో బలమైన పాదాల కింద నలుగుతున్న చప్పుడు.

సరిగ్గా అప్పుడే గాలిలో రొద పెడుతున్న జీవులు దూరంగా పోయినట్టు టక్కున నిశ్శబ్దమైపోయింది.

అతడు వెనుదిరిగాడు.

అయితే అప్పటికే ఆలస్యమైపోయింది.

ముందు అతని ముక్కుపుటాలకి సోకింది భయంకరమైనటువంటి దుర్వాసన.

మరుక్షణమే మేరు పర్వతం ముఖాన్ని మెరుపులా తాకినట్టు అతని పంచప్రాణాల్ని ఒక్క క్షణం కదిపి కుదిపేస్తూ తగిలిందో ముష్టిఘాతం.

"అఘోరీ" అంటూ అరుస్తూ ఒక్కసారిగా వెనక్కి విరుచుకు పడి పోయాడతను.

అతని చేతిలోని కాలిపోగా మిగిలిన అంగాలతో వున్న బొమ్మ దూరంగా ఎగిరిపడింది.

ముక్కుదూలం విరిగిపోయింది. పళ్ళూడిపోయి నేలపై పడిపోయాయి ..... రక్తంతోపాటు.

హోమం ఎర్రగా వెలుగుతూ ఆ రక్తాన్ని మరింత ఎరుపుచేస్తూ కన్పింపజేసింది.

అదే క్షణంలో గాలిలో ఆకారంలేని నీడలు చేస్తున్న రొద మళ్ళీ మొదలయింది.

చిత్రంగా అవన్నీ ఇప్పుడు నేలమీద పడిపోయున్న అతనివైపు దూసుకురాసాగాయి.

వెంటనే గాలిలో రక్తం కలిసిపోతున్నట్టు నీచు వాసన. మాంసాన్ని శరీరంలోంచి బలవంతంగా చీల్చేస్తున్న ధ్వని.

నేలమీద పీక తెగిన కోడిలా విలవిల్లాడుతున్నాడతను. పట్టుకోసం మట్టినేలని పెళ్ళగిస్తున్నాడు.

కాళ్ళతో శరీరాన్ని ఆపటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు అతను.

కానీ అతని ప్రయత్నం ఫలించలేదు.

చూస్తూండగానే అతని శరీరం తెల్లగా పాలిపోయి కాలి కుంచించుకుపోయినట్టూ కాళ్ళూ చేతులూ ఎక్కడికక్కడ వంకర్లు తిరిగిపోయాయి.

అప్పుడు వచ్చింది అతని నోటంట ఆర్తనాదం.

“అ ..... మ్ ..... మ్మ్ ..... మ్మా ..... మ్మ్ ..... మ్మ్ ..... ”

అఘోరీ బిగ్గరగా మంత్రాలు చదువుతూ వుండిపోయాడు.

“క్షీరేణ స్నాపితే దేవీ చన్ధనేన విలేపితే

బిల్వ పత్రార్జితే మాతర్థ్యరేహం శరణం గత:

ఇత్యేక యార్థ్యప్రాధ్వీ మాయా మంత్రణ పూజయే దితి

సర్వాంగ బంధన విముక్తదైలౌ సర్వరోగ నివారణహం:

ప్రాణం దేదీప్యమానే తీహం ..... ఓం శంకరార్చ తీహం శంకరార్చతేహం:

మంత్రం పూర్తయిన మరుక్షణం బొమ్మని చేతిలోకి తీసుకుని దానికి చుట్టిన బంధనాలు విప్పేశాడు.

అప్పటిదాకా గుచ్చబడిన తుమ్మ ముళ్ళని లాగివేశాడు.

క్రమంగా అక్కడి రొద సద్దుమణిగింది.

గాలిలో ‘స్స ..... స్స ..... స్స’ మనే ఆ రొద దక్షిణంవైపు సాగిపోయి వినిపించటం మానేసింది.

గాలి హోరు క్రమంగా తగ్గుముఖం పడుతుండగా అతను కదిలిపోయాడు వేగంగా ..... మానవమాత్రులకి సాధ్యంకాని వేగమది.

* * * * *

డాక్టర్ కార్డియోగ్రాంవైపు చూశాడు.

హార్ట్‌బీట్ ఆగిపోయినట్లు ఒకే ఒక్క సరళరేఖ ..... ఎటూ కదలకుండా నిశ్చలంగా

కన్పిస్తోంది.

వెంటనే అతడు సిస్టర్‌వైపు చూశాడు. రెడీగా పట్టుకున్న సిస్టర్స్, నీడిల్స్, స్కిన్, ఎక్స్‌పాండర్స్ అతనికి అందించిందామె.

వెంటనే అతడు తనకు కావలసిన పరికరం చేతిలోకి తీసుకుని మహదేవ్ ఎడమ ఛాతీ ఎముక వెంబడి ఉదర:కుహరాన్ని నాలుగు సెంటీమీటర్ల వరకూ కోశాడు.

ముందు ఫైబర్ ఆప్టిక్ కెమెరా ఆ భాగంలోంచి లోపలికి పంపబడింది. మరుక్షణం కంప్యూటర్ స్క్రీన్‌లో అతని హృదయంలోని అన్ని కోణాల్నీ స్పష్టంగా చూపించసాగింది.

చలనం కోల్పోయిన అతని గుండె యుద్ధంలో క్షతగాత్రమై పడిపోయిన సైనికుడిలా కన్పిస్తోంది.

డాక్టర్ గుండెనుంచి కనెక్టయి వున్న కరోనరీ ధమని ఫైబర్ ఆప్టిక్ కెమెరాలో చూశాడు.

ప్లాక్‌తో పూర్తిగా మూసుకుపోయి వుందది.

వెంటనే దాన్ని శుద్ధి చేశాడు డాక్టర్. మళ్ళీ గుండెకి కనెక్ట్ చేశాడు.

అతను తిరిగి చూశాడు కంప్యూటర్‌లోకి.

ఏమాత్రం చలనం రాలేదు గుండెలో.

అదే సమయంలో చిన్న గాలి తెమ్మెర ..... ఆ వెంటనే భరించలేనంత దుర్వాసన. తానున్నది ఆపరేషన్ థియోటరో, మార్చురీ రూమో అర్థంకాలేదు ఒక క్షణం డాక్టర్‌కి.

కొన్ని ..... కేవలం ..... కొన్ని ..... క్షణాల్వ అక్కడున్న వారందర్నీ ఇబ్బంది పెట్టిన ఆ చెడువాసన తరువాత తగ్గిపోయింది.

అప్పుడు గమనించాడు డాక్టర్ ..... కార్డియోగ్రాంలో సరళరేఖ కొంచెం ..... చాలా తక్కువ వేగంతో పైకి లేచింది.

కళ్ళు విప్పార్చుకుని చూస్తుండిపోయాడతను. క్రమంగా వేగాన్ని అందుకుంది ..... పైకి కిందకి పయనిస్తూ చిన్నగా శబ్దం చేయసాగింది.

వెంటనే చిన్న చిరునవ్వు మెరిసిందీ డాక్టర్ మొహంలో.

అందరూ సంతోషంగా కంప్యూటర్ వైపు చూస్తుండగా గుండె దగ్గర కోసిన చర్మాన్ని కలుపుతూ కుట్లు వేయసాగాడు డాక్టర్.

* * * * *

అదే సమయంలో ఆపరేషన్ థియేటర్ బయట నిస్త్రాణంగా కూర్చున్న అభిరాం, మనస్విని, తిరుపతి ముక్కుపుటాలకి సోకిన భరించలేనంతటి దుర్వాసనకి చేతులడ్డుపెట్టుకున్నారు.

తిరుపతికి ఆ వాసనెక్కడో యింతకు ముందు తగిలిన జ్ఞాపకం వచ్చింది.

"ఎక్కడ? ఎక్కడ?" అనుకున్నాడతను. కొన్ని క్షణాల తర్వాత గుర్తుకొచ్చింది.

'ఆఁ! గుర్తుకొచ్చింది ..... తను ధ్యానంలో వున్నప్పుడు చూసిన గుహలోని భీకరాకారుడి

దగ్గర్నుంచి ..... అంటే వరప్రసాదం ..... ' అనుకుని అభిరాంకేదో చెప్పటానికి నోరు తెరిచాడు.

*   *   *   *   *

ఆ రోజు మహదేవ్, మిసెస్ మనస్విని మహదేవ్ అభిరాం ఇంటికి భోజనానికి వచ్చారు.

అభిరాం, మిసెస్ ధన్యా అభిరాం, సుమతమ్మ వాళ్ళిద్దర్నీ సాదరంగా ఆహ్వానించారు.

కులాసా కబుర్లు, జోకుల తర్వాత హఠాత్తుగా వరప్రసాదం టాపిక్ వచ్చింది.

అభిరాం మౌనంగా వుండిపోయాడు.

"అరవై ఏళ్ళవాడయినా ఎంత హుషారుగా వుండేవాడని ..... వయసులో వున్నప్పుడు చేసినట్టే యిప్పుడు కూడా చేశాడు. 'ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్ళిపోయాడు" అన్నాడు మహదేవ్.

'నీ బదులు తను చేరుకున్నాడు మహదేవ్ ..... మరణించేవారుండే చోటికి' అనుకున్నాడు అభిరాం.

అప్పుడే అటుగా వీచిన పిల్ల తెమ్మెర వాళ్ళని సేదతీరుస్తున్నట్లు చల్లగా శరీరమంతా తిరిగి ఆప్యాయంగా వారిని చుట్టేసింది.

------:శుభం :-----